www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 నవంబర్ 2023
5
చిత్తూరు

ఇదేనా.. సామాజిక సాధికారిత..?

- అందని డైట్ ఛార్జీలు
- అవస్థల్లో వసతి గృహనిర్వాహకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సామాజిక సాధికారిత పేరిట రాష్ట్రప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహిస్తోంది. ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు అది చేశాం, ఇది చేశామని గొప్పలు చెప్పుకుంటోంది.. కానీ ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ సంక్షేమ కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకుండా నిర్వీయం చేయడంతో పాటు పూటగడవక ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న విద్యార్థులకు ప్రతినెలా చెల్లించాల్సిన డైట్‌ఛార్జీలు సైతం గత ఐదు నెలలుగా అంటే ఈ ఏడాది జూన్ నుండీ ఇవ్వడం లేదు. దీంతో వసతి గృహ నిర్వాహకులు సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు మూడు పూటలా తిండిపెంటేందుకు నానా తంటాలు పడుతున్నారు. సామాజిక సాధికారిత అంటే ఇదేనా అంటూ ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనార్టీ సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.

వార్డెన్ల కష్టాలు వర్ణనాతీతం..

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 65మండలాల్లో సాంఘీక సంక్షేమశాఖ పరిధిలో 61 బాలుర వసతి గృహాల్లో 2,691 మంది బాలురు, 26 బాలికల వసతి గృహాల్లో 1,304 మంది బాలికులు మొత్తం 87 బాలుర, బాలికల వసతి గృహాల్లో 3,995 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అలాగే 32 కళాశాలల వసతి గృహాల్లో 15 బాలురు వసతి గృహాల్లో 897,

17 బాలికల వసతి గృహాల్లో 1,140 మంది బాలికలు మొత్తం కళాశాల సాంఘీక సంక్షమ వసతి గృహాల్లో 2,037 మంది వసతి పొందుతున్నారు. ఒక్క సాంఘీక సంక్షేమశాఖలో పెద్దసంఖ్యలో వసతి గృహాల్లో చదువుతున్న బాల, బాలికలు ఐదు నెలలుగా డైట్‌ఛార్జీలు రాకపోవడంతో ఓ వైపు విద్యార్థులు, మరోవైపు వార్డెన్లు వసతి గృహాల్లోని విద్యార్థులు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. గిరిజన సంక్షేమశాఖ వసతి గృహాల్లోని 2,245 మంది విద్యార్థులు, మైనార్టీ సంక్షేమ వసతి గృహం మదనపల్లిలో వంద మంది విద్యార్థులు, తిరుపతిలోని మైనార్టీ బాలికల పోస్ట్‌మెట్రిక్ వసతి సంక్షేమ గృహంలో 50మంది బాలికల్లో 21మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ నుండి పిహెచ్‌డి చవుతున్నారు. ఈ మైనార్టీ సంక్షేమ వసతి గృహాల పరిస్థితి ఇంతే..

డైట్ ఛార్జీ రూ. 49లే..

సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థికి రోజుకు ప్రభుత్వం ఇచ్చేది రోజుకు రూ.49లు మాత్రమే. పాఠశాల విద్యార్థులకు ఉదయం అల్పహారం, రాత్రి భోజనం వండి పెట్టాల్సి ఉంటుంది. మధ్యాహ్నం పాఠశాల్లో పెట్టే మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. రోజుకు ఉదయం, రాత్రి ప్రభుత్వ మెనుప్రకారం భోజనం పెట్టేందుకు ప్రభుత్వం ఇచ్చే డైట్‌ఛార్జీ రూ.49లు ఏమాత్రం సరిపోవడం లేదని డైట్‌ఛార్జీలు పెంచాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మరోవైపు ఇచ్చే డైట్‌ఛార్జీలు కూడా నెలల తరబడీ చెల్లించకపోవడంతో కిరాణాషాపు యజమానుల నుండీ ఒత్తిడి పెరుగుతోందని వసతి గృహ నిర్వాహకులు వాపోతున్నారు. చౌకదుకణాల ద్వారా ప్రభుత్వం బియ్యం మాత్రమే సరఫరా చేస్తోందని కోడిగుడ్లు, చికెన్, పప్పు, నూనె, కూరగాయలు ఇతర పోపు సమాన్లు బహిరంగ మార్కెట్‌లో కొనుగులు చేయాల్సి వస్తోంది. కిరాణా కొట్టులో ఒకటి, రెండు నెలలు అప్పు ఇస్తున్నారని నెలల తరబడీ డైట్‌ఛార్జీలు రాకపోవడం వల్ల కిరాణాకొట్టు యజమానులు అప్పు ఇవ్వకపోవడంతో అనేక మంది వసతి గృహ నిర్వాహకులు జీతాల నుండీ కిరాణాకొట్టు యజమానులకు డబ్బులు ఇవ్వాల్సిన దుస్థితి ఏర్పడింది. సామాజిక సాధికారిత పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బస్సులు యాత్రలు నిర్వహిస్తున్న తరుణంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ సంక్షమ విద్యార్థుల పెండింగ్ డైట్‌ఛార్జీలు చెల్లించాలని వసతి గృహనిర్వాహకులు, విద్యార్థి సంఘాలు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

336 ఎండియు వాహనాల ద్వారా

ఇంటింటికీ రేషన్ అందజేత : జెసి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో 336 ఎండియు (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాల ద్వారా 5 లక్షల 41 వేల రేషన్ కార్డుదారులకు రేషన్‌ను అందజేయడం జరుగుతున్నదని జిల్లా జాయింట్‌కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్‌తో కలిసి ఇంటింటికి రేషన్ కార్యక్రమంపై అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి రేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ఎండియు వాహనాల ద్వారా రేషన్‌దారుల వారి ఇంటి వద్దకే రేషన్‌ను అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతున్నదని, ఈ విషయంలో జిల్లాల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, కావున అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు వారి పరిధిలో ఇంటింటికి రేషన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఎండియు వాహనాలు ఏ రోజున ఆయా గ్రామాలకు వెళ్ళేది ముందుగా రేషన్‌దారులకు తెలియజేయాలని, రేషన్‌ను వారి ఇంటి వద్దకే వెళ్లి అందించాలని, ఇంటి వద్దకు వెళ్లలేని పరిస్థితులున్న చోట ఏపాయింట్ నుంచి రేషన్ పంపిణీ చేస్తామనే విషయాన్ని వాలంటీరు సహాయంతో ముందుగా సమాచారం రేషన్‌దారులకు అందించాలన్నారు. ప్రతినెలా రేషన్ పంపిణీ పూర్తి అయిన అనంతరం ఎండియు ఆపరేటర్లతో మండల స్థాయిలో సమావేశం నిర్వహించి వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. 2 వేల రేషన్‌కార్డుల కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉన్నచోట అదనంగా మరో ఎండియు వాహనం కొరకు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని, రేషన్ పంపిణీకి పనికిరాని ఎండియు వాహనాల స్థానంలో కొత్త వాహనాల కొరకు ప్రతి పాదనలు పంపాలని తెలిపారు. జిల్లాలో ప్రతి నెలా 17వ తేదీ లోపు రేషన్ పంపిణీ చేయడం జరుగుతున్నదని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎస్ఓ శంకరన్, ఏఎస్ఓ శేషాద్రి చలం, అధికారులు పాల్గొన్నారు.

పండుగ పూటా పస్తులే...

విజయ డెయిరీ కార్మికుల రిలే దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

కార్మిక చట్టాల ప్రకారం తమకు రావాల్సిన వేతన బకాయిల కోసం సహకార విజయ డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 60వ రోజుకు చేరుకుంది. వేతన బకాయిల కోసం కార్మికులు దీక్షలు చేస్తున్నా వారి కుటుంబాల ఆకలికేకలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన వేతన బకాయిల కోసం దీపావళి పండుగ రోజున కూడా తమ దీక్షలను కొనసాగిస్తామని కార్మిక సంఘం నేతలు తెలిపారు. ప్రభుత్వం వెంటనే తమ వేతన బకాయిలు చెల్లించాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న కార్మికులు

12 మంది మహిళలకు ఆటోలు మంజూరు

డిఆర్‌డిఏ పీడీ తులసి

మంజూరైన స్వయం సహాయక సంఘాల మహిళలు

ప్రజాశక్తి- చిత్తూరు: జిల్లాలో ఉన్నతి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల్లోని అర్హత కలిగిన 12 మంది ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆటోలు మంజూరు చేసినట్లు చిత్తూరు జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డీలేని రుణాల ద్వారా ఈ ఆటోలను పంపిణీ చేయనున్నట్లు, ఈ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులకు సెర్ప్ ఆధ్వర్యంలో ప్రస్తుతం విజయవాడలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా ఆటో ఎలా నడపాలి అనే విషయాలపై రవాణాశాఖ అధికారుల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. అలాగే ఆటోలో ఏదైనా సాంకేతిక లోపం నెలకొంటే ఎలా పరిష్కరించుకోవాలనే అంశాలపై బజాజ్, అప్పి ఆటో సంస్థల ప్రతినిధులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. లగేజ్ ఆటోలతోపాటు ప్రయాణికులను తరలించే ఆటోలను సైతం లబ్ధిదారులకు వడ్డీలేని రుణాల రూపంలో పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విజయవాడలో లబ్ధిదారులకు శిక్షణ పూర్తి అయిన తర్వాత వారు ఎంపిక చేసుకున్న ఆటోలను నేరుగా లబ్ధిదారులు ఇంటికే చేర్చడం జరుగుతుందని, రాష్ట్రవ్యాప్తంగా ఈకార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 2023 డిసెంబర్ 6 తేదీన ప్రారంభించనున్నట్లు పీడీ తెలిపారు.

జాబ్ కేలెండర్ విడుదల చేయాలి

యువజన సంఘాల ధర్నా

గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న జనసేన, టిడిపి యువజన నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కేలెండర్‌ను విడుదల చేయాలని కోరుతూ జనసేన, టిడిపి యువజన సంఘాలు శనివారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు యువత నాయకులు కాజూరు రాజేష్, జనసేన యువజన సంఘం నాయులు లోచన్ శ్రీరాం, యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కేలెండర్ పేరుతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను మోసం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ కల్పన పేరుతో చూపుతున్న లెక్కలన్ని తప్పుడు లెక్కలేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మోసాన్ని రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.

12న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల జీవితాలలో దీపావళి వెలుగు రేఖలు ప్రసరించాలని, ప్రతి ఇంట్లో ఆనందం, సంతోషపు వెలుగులు వెల్లివిరియాలని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఒక ప్రకటనలో వారు శ్రీవారి భక్తులకు, ఉద్యోగులకు, శ్రీవారి సేవకులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారి అనుగ్రహంతో రాష్ట్రం, దేశం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని వారు కోరారు.

12న శ్రీవారి ఆలయంలో దీపావళి ఆస్థానం

తిరుమల శ్రీవారి ఆలయంలో దీపావళి పండుగ సందర్భంగా ఉదయం 7 నుండి ఉదయం 9 గంటల వరకు బంగారు వాకిలి ముందు గల ఘంటా మండపంలో దీపావళి ఆస్థానం జరుగుతుంది.

అసమానతలు లేని అభివృద్ధి కోసం పోరాటం

ఎర్రజెండా ప్రజారక్షణ భేరి

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- తిరుపతి సిటి: దేశంలోనూ, రాష్ట్రంలోనూ రానురాను పరిస్థితులు దారుణంగా తయారవుతున్నాయి. ప్రజాస్వామ్యమన్నది కనుమరుగువుతోంది. లౌకికవాదాన్ని మరిచిపోయారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, కర్షకులు, ఆడ, మగ, వృద్ధులు, పిల్లలు ఒకరేమిటి ప్రతి ఒకరు సమస్యల వలయంలో పడిలేస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలి.. ధనవంతులకు పాలకులు తొత్తులుగా మారారు. దేశ సంపద మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగించేస్తూ, ప్రభుత్వరంగ సంస్థలన్నిటిని నిర్వీర్యం చేస్తూ, దేశాన్ని అదోగతిపాలు చేస్తున్న విషయం జగమెరిగిన సత్యం. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, నిలదీసిన వారికి అరెస్టులు, ప్రభుత్వ సంస్థలైన ఈడీలు, సిఐడి, సిబిఐ అన్ని పాలకుల చేతుల్లో బొమ్మలుగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎవ్వరో వచ్చి మనల్ని ఉద్దరిస్తారని చూసే కన్నా, మన బతుకులను, రాష్ట్ర, దేశ భవిష్యత్తును సక్రమ మార్గాన నడిపించేందుకు ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన కాలం వచ్చింది. అందర్నీ ఐక్యం చేసేందుకు ఎర్రజెండా కదలింది. ప్రజారక్షణ భేరితో కదం తొక్కుతోంది. రాష్ట్రంలోనూ అదేపరిస్థితి.

రాష్ట్రాన్ని విడగొట్టి పదేళ్ల పూర్తి కావకస్తోంది. అప్పుడు మనకు అరచేతిలో స్వర్గం చూపించారు. కేంద్రంలోని బిజెపి నాయకులు. ప్రత్యేక హోదా, పోలవరం జాతీయ ప్రాజెక్టు, కడప ఉక్కుప్యాక్టరీ, రామాయపట్నం మేజర్ పోర్టు, రాజదాని నిర్మాణం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కేంద్ర విద్యాసంస్థల ఏర్పాటు, రైల్వేజోన్ వంటి విభజన హామీలలో ఏ ఒక్కటీ ఇప్పటి వరకు అమలు కాలేదు. రాష్ట్ర ప్రజల్ని మోసం చేసిన బిజెపి ప్రభుత్వం అంతటిదో ఆగకుండా రాష్ట్ర పారిశ్రామిక అబివృద్ధికి గుండెకాయ లాంటి విశాఖ ఉక్కును తెగనమ్మడానికి తయారు కావడం గమనార్హం. బిజెపి పాలనలో దేశమే అస్తవ్యస్తంగా తయారైంది. బిజెపి బుల్‌డోజర్ రాజకీయాలతో అన్నదమ్ముల్లా మెలగాల్సిన ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తోంది. బిజెపి పాలిత ప్రాంతాల్లో మైనార్టీలకు రక్షణ కరువైంది. స్త్రీలను నడిరోడ్డు మీద నగ్నం ఊరేగించి, సిగ్గులేకుండా అదేదో తమ ఘనత అన్నట్టు విర్రవీగుతున్నవారిని మోడీ ప్రభుత్వం సమర్ధిస్తుండడం శోచనీయం. కోట్లాది మంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తెచ్చింది. దేశీయ వ్యవసాయానికి, ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది. రైతుల పోరాటంతో వాటిని రద్దు చేసింది. అర్ధాకలితో బతుకుతన్న వారు ప్రపంచంలోకెల్లా దేశంలోనే అధికంగా ఉన్నారంటే పరిస్థితి అర్ధమవుతోంది. నిరుద్యోగం రికార్డుస్థాయిలో పెరిగిపోతోంది. ధరల పెరుగదలో సామాన్యుడి నడ్డి విరుగుతున్నా మోడీ ప్రభుత్వం మాత్రం భారత్ అబివృద్ధిలో ముందుకు పోతోంది అంటూ పచ్చి అబద్దాలను వల్లవేస్తోంది. రాష్ట్రంలోనూ పరిస్థితి అలానే తయారైంది. కృష్ణపట్టణం, గంగవరం మేజర్ పోర్టులను ఆదానికి నైవేద్యంగా అప్పగిస్తున్నారు. విద్యుత్ ఛార్జీలు చాపకింద నీరులా పెంచేశారు. స్మార్ట్‌మీటర్ల, మోటర్లకు మీటర్ల పేరుతో, ఆస్తి పన్ను నుంచి చెత్తపన్ను దాకా అన్ని వడ్డింపులతో ప్రజలపై భారాలు మోపుతున్నారు. సిఎంకు నవరత్నాలు తప్పా పెరిగిన ధరలు, నిరుద్యోగం, గిట్టుబాటు లేని వ్యవసాయం, రక్షణ కరువైన చేతివృత్తులు, కౌలురైతులు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదు. పైగా కరెంట్ ఛార్జీలు, ఇసుక ధరలు ప్రభుత్వమే పెంచింది. ఉపాధిని దెబ్బతీస్తున్నారు. చిన్న పరిశ్రమలు మూతబడ్డాయి. వైసిపి పాలనలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు. నిరసన కూడా తెలియజేయడానికి కూడా వీలు లేకుండా నిర్భందాలు, ముందస్తు అరెస్టులు, బైండోవర్ కేసులు బనాయిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని పల్లెత్తు మాట అనడం లేదు. పైగా వారిని పార్లమెంట్‌లో బలపరుస్తోంది. రాష్ట్రంలోని పోర్టులన్ని ఆదాని పరం చేసినా, విద్యుత్ ఛార్జీలు పెంచినా, ఉద్యోగుల పెన్షన్‌కి ఎసరు పెట్టినా, చంద్రబాబు నోరు విప్పడం లేదు. ఇక జనసేన పార్టీపరిస్థితి మరీ అన్యాయంగా తయరైంది. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి కూటమిలో ఉంటూ మోడీ నాయకత్వాన్ని సమర్ధిస్తూ మన రాష్ట్రానికి ఏ విధంగా న్యాయం చేయగలదో ఆ పార్టీ నాయకత్వానికే తెలియాలి. ఈ విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను, రాష్ట్రాన్ని పూర్తిగా గాలికొదిలేశాయి. ప్రధాన పార్టీలు తమలో తాము అధికారం కోసం కుస్తీలు పడుతున్నాయి. ప్రమాదంలో పడిన మన రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోలన్నా, సామాన్య ప్రజలకు నిజమైన ఊరట లభించాలన్నా ప్రజలే ఐక్యంగా కదలాలి. అప్పుడే ప్రత్యేక హోదాను సాధించగలం. విశాఖ ఉక్కును కాపాడుకోగలం. విభజన హామీలు అమలు జరిగేటట్టు చూడగలం. అందుకు ఎర్రజెండా నడుంబిగించింది.

గతాన్ని ఒకసారి గమనం చేసుకుంటే విశాఖ ఉక్కు సాధన కోసం ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చేసినప్పుడు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసం, చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచినప్పడు బషీర్‌బాగ్ పోరాటంలో తెలుగవాడి సత్తా ఏమిటో చూపించాం. ఇప్పడు అలాంటి మరోమహా ఉద్యమం అవసరం. అందుకే ప్రజారక్షణ భేరి. సిపిఎం ప్రజలను చైతన్యం చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్ర పేరుతో ప్రజారక్షణ భేరిని మ్రోగించింది. నాలుగు బృందాలుగా విడిపోయి ఈ బసుస యాత్ర రాష్ట్ర నలుమూలల పర్యటిస్తోంది. అందులో భాగంగా గత వారం ఈ యాత్ర మూడురోజుల పాటు తిరుపతి జిల్లాలో సైతం సాగింది. ఈ యాత్ర నవంబరు 15వ తేదీకి విజయవాడకు చేరుకుంటాయి. అదేరోజు భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలందరూ ఈ సభకు తరలివచ్చి ప్రజావ్యతిరేక ప్రభుత్వాలకు తగిన విధంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కల్యాణ కట్టలో వేధింపులు మానుకోవాలి

- తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి
- పది రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే
- టిటిడిఎడి బిల్డింగ్ ముట్టడి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు ప్రధాన కార్యదర్శి కందారపు మురళి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుమల కళ్యాణకట్టలో వేధింపులను మానుకోవాలని, కేఓడీ (కెప్ట్ ఆన్ డ్యూటీ)ని రద్దు చేయాలని తిరుపతిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. శ్రీవారి కళ్యాణకట్ట నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం తిరుపతి నగరంలోని యశోదానగర్ వేమన విజ్ఞాన కేంద్రంలో మేళ్ల చెరువు గంగులప్ప అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ తిరుమలలో పనిచేసే కళ్యాణకట్ట క్షురకులను టీటీడీ యాజమాన్యం వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. కళ్యాణకట్టలో 849 మంది క్షురకులు పని చేస్తున్నారని, కేఓడి పేరిట 49మందికి డ్యూటీలు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమన్నారు. సంవత్సర కాలంగా తొలగించిన వారు జీతభత్యాలు లేక అవస్థలు పడుతున్నారని, వారిని తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య మరికొందరు యాజమాన్యానికి అనుకూలంగా మాట్లాడటం దారుణమని విమర్శించారు. అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రోజులలో మహిళలను చేతులతో తాకటం, బట్టలిప్పి తనిఖీ చేయడం సిగ్గుచేటని అన్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి వెంటనే స్పందించి తిరుమల కళ్యాణ కట్టలో పనిచేసే క్షురకులకు న్యాయం చేయాలని కోరారు. పది రోజులలో సమస్యను పరిష్కరించని పక్షంలో తిరుపతిలోని టీటీడీ ఎడి బిల్డింగ్ ఎదుట నవంబర్ 21వ తేదీ మంగళవారం పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.నాగరాజు మాట్లాడుతూ టీటీడీలో కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. ఎక్కడా లేని కేఓడి విధానాన్ని తిరుమల కళ్యాణకట్టలో పనిచేసే క్షురకులకు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. శ్రీవారి కళ్యాణకట్ట నాయిబ్రాహ్మణ సంఘం కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ క్షురకులను అదేపనిగా వేధిస్తున్నారని పలు ఘటనలను ఉదహరించారు. టీటీడీ యాజమాన్యం తమపై కక్ష కట్టడం అన్యాయమని కేఓడి విధానాన్ని రద్దుచేసి తొలగించిన పీస్‌రేట్ క్షురకులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాధాదేవి మాట్లాడుతూ తిరుమల కళ్యాణకట్టలో మహిళా క్షురకుల బట్టలిప్పి తనిఖీ చేయడం దారుణమని అన్నారు. ఇలాంటి ఘటనలు భారతదేశంలో ఎక్కడా జరగటం లేదని గుర్తుచేశారు. కేఓడి పేరుతో తొలగించిన కార్మికులను పనుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ క్షౌరవత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు గంగులప్ప మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుంచి క్షురకుల సమస్యలపై పోరాడి అనేక హక్కులను, సాధించుకున్నామని గుర్తుచేశారు. బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్రనేత బుట్టా సుధాకర్ యాదవ్, తిరుపతి అధ్యక్షులు సురేష్ నాయి బ్రాహ్మణ సంఘం నేతలు సదాశివం, బుజ్జి బాబు, సుధాకర్, శ్రీహరి, సుమతి ప్రసంగిస్తూ ప్రశ్నించిన వారిని ఉద్యోగం నుంచి తొలగించడం దారుణమన్నారు. కళ్యాణకట్ట క్షురకుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, టి.సుబ్రహ్మణ్యం, నాగ వెంకటేష్, వేణుగోపాల్, చిన్నా, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, జయంతి మద్దతు తెలిపారు.

కేఓడీ ఏడాదిగా ఉద్యోగం లేదు

- వనజ, కళ్యాణ కట్ట మహిళా క్షురకురాలు

నేను గత 13 సంవత్సరాలుగా తిరుమల కళ్యాణ కట్టలో పనిచేస్తున్నాను. గత ఏడాది కళ్యాణ కట్టలో ఓ భక్తురాలు కుమార్తెకు గుండు చేస్తుండగా చిన్న గీత పడింది, గుండు చేసుకోవడానికి ఆ చిన్న పాప ఏడవడం కదలడం వల్లే చిన్న గాయమైంది. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కేఓడీ పేరుతో నెలరోజులు ఉద్యోగం నుంచి తొలగించారు. ఏడాది పాటు గడిచిన పనిలో తీసుకోలేదు. కోర్టును ఆశ్రయించడం వల్ల టిటిడి కళ్యాణ కట్టలు ఉద్యోగం ఎంతవరకు ఇవ్వలేదు, ఇలాగైతే మేము ఎలా బతకాలి. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులకు తమ న్యాయం చేయాలి.

యూనియన్ నాయకుడుగా ఉండడం వల్లే తొలగించారు..

- ప్రసాద్, కళ్యాణ కట్టల పీస్‌రేట్ అసోసియేషన్ కార్యదర్శి

కళ్యాణ కట్టలు పీస్ రేట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఉండటం వల్లే నన్ను ఉద్యోగం నుంచి తొలగించారు. నేను ఏ తప్పు చేయలేకపోయినా ఏడాది నుంచి ఉద్యోగం తొలగించారు. ఉద్యోగం జీతం లేక నానా ఇబ్బందులు పడుతున్నాను. ఉద్యోగం ఇవ్వాలని పలుమార్లు ఉన్నతాధికారులు కలిసినా వారు ఎటువంటి న్యాయం చేయలేదు. హైకోర్టును ఆశ్రయిస్తే టీటీడీ ఉన్నతాధికారులను కోర్టు కూడా తనను ఎందుకు తొలగించారనే కారణం చూపలేదు. తప్పులు చేసిన వారిని ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా యూనియన్ నాయకుడైన తనను ఉద్యోగం నుంచి తొలగించడం దారుణం. ఇప్పటికైనా నాకు ఉద్యోగం కల్పించే న్యాయం చేయాలి.

మొబైల్ లైట్ వెలుగులో గుండు చేశానని..

- సుమతి, కళ్యాణ కట్టలో మహిళా క్షురకురాలు

కళ్యాణకట్టలో విద్యుత్ లేకపోయినా నాపై ఒత్తిడి తెచ్చి వెంటనే గుండు చేయాలని భక్తులు కోరారు, అయినప్పటికీ నేను తిరస్కరించాను, గుండు చేయించుకోవడానికి ఎక్కువ గంటల సమయం ఇక్కడ వేచి చూస్తున్నామని భక్తులు బయట ఊర్లో వెళ్లాలని సమయం అవుతుందని చెప్పడంతో వారి మొబైల్ ఫోన్ టార్చ్‌లైట్ ఫ్లాష్ వెలిగించి గుండు చేయాలని కోరడం వల్లే నేను భక్తులకు గుండు చేయడం జరిగింది. దీని కారణంగానే కేఓడి పేరుతో ఉద్యోగం నుంచి తొలగించారు. జరిగిందాట్లో నా తప్పు ఏమీ లేకపోయినా నన్ను ఉద్యోగంలో నుంచి తొలగించడం అన్యాయం. టీటీడీ ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలి.

జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి జరుపుకోవాలి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగ జరుపుకోవాలని ఎంపిపి లతబాలాజి అన్నారు. మండల ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

సమన్వయంతో అత్యధిక మెజారిటీ సాధిద్దాం



ఇంటింట ప్రచారంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-సదుం: సమన్వయంతో పని చేసి పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపిద్దాం అని వైసిపి మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం వై ఏపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సదుం 1,2 సచివాలయాల పరిధిలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఎల్లప్ప, సర్పంచ్ ఉషారాణి, నాయకులు ప్రకాష్, మధన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మల్‌రెడ్డి, షబ్బీర్, ఇర్ఫాన్, దాము తదితరులు పాల్గొన్నారు.

అధిక రేట్లతో దోచేస్తున్నారు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: టపాకాయల విక్రయదారులు అధిక రేట్లతో దోచేస్తున్నారంటూ సామాన్యులు మండిపడుతున్నారు. శనివారం మండల కేంద్రంలోని సరస్వతి స్కూల్ ఆవరణలో టపాకాయల విక్రయాల్లో బిల్లులు లేకుండా అమ్మకాలు చేపడుతున్న నిర్వాహకుల తీరును పలువురు తప్పుబట్టారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి ప్రాంతీయ అధికారి నరేంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్యావరణానికి హాని కలగని టపాకాయలను ప్రజలు వినియోగించాలని కోరారు. పర్యావరణం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని సూచించారు.

పిల్లలకు విద్యాసామాగ్రి పంపిణీ

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి గ్రామ పంచాయతీలో గల ఎస్టీ కాలనీలో పిల్లలకు తిరుపతి పక్కనే ఉన్న రామాపురంకి చెందిన సమీరా పుట్టినరోజు సందర్భంగా పిల్లల చేతుల మీదగా కేక్ కట్ చేపించి 35 మంది పేద పిల్లలకు విద్యా సామాగ్రి, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మధురాంతకం మునిశేఖర్ తెలిపారు.

ఘనంగా బర్సి భోగ బండారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో బంజారా (లంబాడి) జాతి సాంప్రదాయ బద్ధంగా దర్శి భోగ బండారు విజయవంతంగా నిర్వహించారు. హథీరాంజి బావాజీ బర్సి ఉత్సవ కమిటీ వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన లంబాడాలు పెద్ద సంఖ్యలో హాజరైనారు. లంబాడా నృత్యంతో ఊరేగింపు ఘనంగా సాగింది. అనంతపురం సేవా ఘాడ్ నుంచి అఖండ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా హథీరాంజి బావాజీ బర్సి ఉత్సవ కమిటీ కన్వీనర్ శివ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నుంచి పెద్ద సంఖ్యలో బంజారా ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం ఆనవాయితీ అని చెప్పారు. లంబాడాల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి నృత్యాలు నగరంలో పలువురికి ఆకట్టుకున్నాయి. గణపతి, మాజీ ఐపీఎస్ అధికారి డిటి నాయక్, మాజీమంత్రి జగన్నాథ నాయక్, బాబా రామ్ బావన్, ఆచార్య సీతారాం పాల్గొన్నారు.

ఆలత్తూరు టిడిపి మాజీ ఎంపీటీసీ మృతి

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ, అలత్తూరు గ్రామ కమిటీ అధ్యక్షులు గోపి కృష్ణ శనివారం మధ్యాహ్నం హఠాత్తుగా మృతి చెందారు. మంచి నాయకుడిని కోల్పోవడం బాధాకరమని, పార్టీకి తీరని లోటు అని, మండలంలో టిడిపి కుటుంబ సభ్యులందరూ ఆదివారం ఉదయం 9 గంటలకు ఆలత్తూరులో గోపి కృష్ణ భౌతిక కాయానికి నివాళులు అర్పించాలని బుచ్చినాయుడు కండ్రిగ టిడిపి మండల ప్రెసిడెంట్ సుధాకర్ నాయుడు పేర్కొన్నారు.

చంద్రమోహన్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రముఖ నటుడు చంద్ర మోహన్ మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సంతాపాన్ని వ్యక్తం చేశారు. హీరోగా, క్యారెక్టర్‌ఆర్టిస్టుగా, కమెడియన్‌గా 932 చిత్రాలలో నటించి నంది, ఫిలింఫేర్ అవార్డులు అందుకున్నారు. ఆయన మృతి తెలుగు చిత్ర రంగానికి తీరని లోటన్నారు. ఆయనకుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బాబుతో రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ: టిడిపి

ప్రజాశక్తి-తొట్టంబేడు: చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు అన్నారు . మండలంలోని రౌతు సూరమాల, లింగమనా యుడుపల్లి పంచాయతీల్లో బాబు ష్యూరిటీ..భవిష్యత్ గ్యారెంటీని నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాలు కల్పించే బాధ్యత తాము తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కన్నలి రత్నయ్య, ఘట్టమనేని శంకర్ నాయుడు, నెలబల్లి సునీల్ కుమార్, చింత గింజల సునీల్ కుమార్ ,వెంకటయ్య, అంకయ్య, గంధం శ్రీను, నీలమ్మ, వెంకటేషయ్య, లక్ష్మమ్మ, సుబ్బమ్మ, గురమ్మ పాల్గొన్నారు.

ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓం శ్రీ సాయి రాం వృద్ధాశ్రమంలో శనివారం అన్నదా నం నిర్వహించారు. ఈ కార్యక్రమం మెడనూరు సురేష్ రెడ్డి , శాంతి దంపతుల ఆర్థిక సాయంతో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహన్ రావు, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, గ్రానైట్ ప్రభాకర్, ప్రభాకర్, కోట వెంకటేశ్వర్లు, వాచ్ షాప్ రాము, కుమార్ నాయుడు, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, ప్రసాద్, నిర్వాహకురాలు కళ్యాణి పాల్గొన్నారు.

ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చీకటిని తరిమికొట్టి వెలుగులను నింపేదీపావళి పండుగ ప్రజలందరి జీవితాలలో సరికొత్తకాంతులు నింపాలని ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు డిప్యూటి సిఎం నాయణస్వామి, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రులు డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపిలు మిథున్‌రెడ్డి, ఎన్.రెడ్డప్ప, జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సంస్కృతికి ప్రతిబింభంగా పండుగలు నిలుస్తాయన్నారు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల ,మత, వర్గ విభేదాలను విస్మరించి ప్రజలు సమైక్యంగా జరుపుకునే పండుగ దివ్య దీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తులే శోభావళి.. విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని, ఈ దీపావళి అందరి జీవితాలలో అష్టైశ్వర్యాలు సుఖసంతోషాలు సరికొత్త వెలుగులు నింపాలని మనసారా కోరుకుంటున్నామని తెలిపారు.

జర్నలిస్టులకు నూతన వస్త్రాలు, టపాకాయల పంపిణి

చిత్తూరుఅర్బన్: దీపావళి పండగను పురస్కరించుకొని చిత్తూరు జర్నలిస్టులకు మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్ శనివారం తన కార్యాలయంలో నూతన వస్త్రాలు, టపాయలు పంపిణీ చేశారు. జర్నలిస్టుల కోసం ప్రతి ఏటా నూతన వస్త్రాలు, టపాయాలు పంపిణీ చేస్తున్న బుల్లెట్ సురేష్‌కు చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లోకనాధం, అశోక్‌కుమార్లు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టులకు టపాకాయలు అందజేస్తున్న బుల్లెట్ సురేష్

ఆజాద్ సేవలు మరువలేం: చిన్నారెడ్డి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని మైనార్టీ సంక్షేమ శాఖ ప్రధానమంత్రి నూతన 15 సూత్రాల అమలు కమిటీ జిల్లా సభ్యులు యం. అఫ్జల్‌ఖాన్ అన్నారు. భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ 135వ జయంతిని పురస్కరించుకొని మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ మైనార్టీ సంక్షేమ దినోత్సవం కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానాలు నిర్వహించారు. సన్మానం చేసుకున్న వారిలో పిసిర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్, కన్నన్ ప్రిన్సిపాల్ సయ్యద్, జై హింద్ స్కూల్ హెడ్మాస్టర్ ముక్తియర్‌లు ఉన్నారు. కార్యక్రమంలో జామియా మసీద్ కార్యదర్శి ఫాహిం బాషా, ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ మాలిక్, కార్పొరేటర్ అల్తాఫ్, ముస్లిం నాయకులు రహమాన్, విద్యార్థులు పెద్ద సంఖ్యల హాజరయ్యారు.

ముస్లీమ్ పెద్దలను సన్మానిస్తున్న మైనార్టీ సంక్షేమశాఖాధికారి చిన్నారెడ్డి

ఫలితం లేని ఓటర్ జాబితాను విడుదల చేశారు: రజనీకాంత్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎన్నడూ లేని విధంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ ఫలితం లేని ఓటర్ జాబితాను తయారు చేసి విడుదల చేశారని టిడిపి నాయకులు కంకణాల రజనీకాంత్ నాయుడు విమర్శించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో బిఎల్వోలు ఓటర్ జాబితా పరిశీలనలో అధికార పార్టీకి తలొగ్గి పని చేశారని, దానివల్లనే డబల్ ఎంట్రీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, శాశ్వతంగా అడ్రస్సులో లేని వారి ఓట్లు అలాగే ఉండిపోయి తిరిగి మళ్ళీ ప్రస్తుతం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో వచ్చాయని ఆధారాలు చూపుతున్న ఎవరూ పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అన్ని ఆధారాలతో లేఖలు రాసి పంపామన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితాను పారదర్శక ఓటరు జాబితాగా తయారు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రజనీకాంత్

ఊంజల సేవలో ఆలపించిన శోభా రాజు

ప్రజాశక్తి-తిరుమల: వేంకటేశ్వర స్వామి వారి సహస్ర దీపాలంకరణ సేవా కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ శోభా రాజు శనివారం సంకీర్తనాలపన చేశారు. తొలుతగా "అన్నమ గాయత్రి" మంత్రంతో ప్రారంభించారు. తరువాత మహాలక్ష్మీ అమ్మవారిపై స్వీయ రచనను "రావమ్మా మహాలక్ష్మీ" అంటూ దీపావళి సందర్భంగా ఆలపించారు. అనంతరం "బ్రహ్మగన్న వాడు పసిబిడ్డ బ్రహ్మమైనవాడు పసిబిడ్డ" శ్రీ తాళ్ళపాక చిన్న తిరుమలాచార్యులు రచించిన కీర్తనకు డాక్టర్ శోభారాజు సంగీతం సమకూర్చిన ఈ కీర్తనను శోభా రాజు శిష్యులు రన్విత, పద్మశ్రీ ఆలపించారు. కార్యక్రమానికి వాయిద్య సహకారం కీబోర్డ్ మీద కళ్యాణ్, తబలాపై మంజూ సహకరించారు. అనంతరం ఆలయ వెద పండితుల ఆశీర్వచనంతో డాక్టర్ శోభారాజుకి అమ్మవారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

గణితంలో పునాది, అభ్యసన పటిష్టంగా ఉండాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో శేఖర్

ప్రజాశక్తి-క్యాంపస్:

2026-27 నాటికీ మూడో తరగతి చదివే ప్రతి విద్యార్థి స్పష్టంగా చదవడం, రాయడం గణిత ప్రక్రియలు సాధించే దిశగా ప్రతి ఉపాధ్యాయుడు మిషన్ మోడ్ లో పనిచేయాలని డీఈవో డాక్టర్ శేఖర్ అన్నారు. విశ్వం హైస్కూల్ తిరుపతి నందు చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల నుండి మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి డిపార్ట్మెంట్, పాఠశాల విద్యాశాఖ నుండి ఎంపికైన డిఆర్పిలకు ఆరు రోజులు పాటు రెసిడెన్సియల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరానికి రాష్ట్ర పరిశీలకులుగా డాక్టర్ పెంచలయ్య హాజరైనారు. మూడు జిల్లాల నుండి 200 మంది హాజరైన ఈ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమంలో తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ "భాష మరియు గణితంలో పునాది అభ్యసనం పటిష్టంగా ఉంటే విద్యార్థి అన్ని విషయాలు నేర్చుకోవడము సులభతరం అవుతుందన్నారు. పాఠశాల సంసిద్ధత మేళా, బోధన అభ్యసన కత్యాల మేళను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు బడి పట్ల ఆసక్తిని కలిగించి పాఠశాల వాతావరణమునకు అలవాటు పడడానికి సహాయపడుతుందని ట్రైనింగ్‌లో నేర్చుకున్న విషయాలను పాఠశాల స్థాయిలో అమలుపరచి విద్యార్థులలో పునాది అభ్యసనము, గణిత ప్రక్రియల సాధనకు కృషి చేయాలని అలాగే విద్యాబోధనలో సాంకేతికను జోడించి తరగతిగదిని ఆహ్లాదకరంగా మార్చుకోవాలని తద్వారా విద్యార్థులలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందింపజేయాలని జిల్లా అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ శివ శంకరయ్య డిఆర్పిలను కోరారు. కార్యక్రమంలో విశ్వం స్కూల్ అధినేత విశ్వనాథ్‌రెడ్డి పాల్గొని పలువురు కె ఆర్పిలను దుస్సాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పుష్ప, మధు,సూపరిండెంట్ రోహిణి భాయ్, రాజారామ్, కేఆర్పీలు అనిత , పద్మజ , నరసయ్య, సంస్థ కోఆర్డినేటర్లు చందు, గోపికష్ణ, మురళి, గణేష్, శ్రావణి, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం కార్యదర్శి కృపావరమ్మకు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

విశ్రాంత ఉద్యోగుల పుత్తూరు శాఖలో కార్యదర్శిగా సేవలు కొనసాగించిన కృపావరమ్మ అనతి కాలంలోనే జిల్లా కార్యదర్శి గా ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం ఆమె సేవా తత్పరతకు నిదర్శనమని గౌరవ అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి అన్నారు. ఉద్యోగ రీత్యా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గా పని చేసి పదవీ విరమణ అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంఘం లో అంచలంచెలుగా ఎదిగిన కృపావరమ్మకు సన్మానం నిర్వహించారు. గుణశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంకిత భావం తో చేసే అలుపెరగని సేవ ప్రశంసనీయమని, ఎందరికో ఆదర్శం అన్నారు. కుటుంబ సభ్యులు కూడా కృపావర మ్మను సత్క రించారు. ఇటీవల రాష్ట్ర ఖజానా సంచాలకులు ఆదేశాల మేరకు ఉప ఖజానా అధికారి నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశం లో మన సంఘం సభ్యుల సమస్యల మెమొ రాండం ను సమర్పిం చారని అధ్యక్షు లు భాస్కర్‌రాజు తెలిపారు. ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీ లలో మార్పులు చేర్పులు కోసం ప్రత్యేక దరఖాస్తు లో బాధితుల నుండి సేకరిం చారు. సంఘ సభ్యులు అరుణాచలం సేవలను గుర్తించి అసోసి యేటెడ్ అధ్యక్షులుగా భాస్కర రాజు సంఘ అద్యక్షులు అంద రి ఆమోదం తో నియమించారు. ఈ కార్యక్ర మంలో కుప్పయ్య, రామలింగం, యుగంధర్, కృష్ణమ నాయుడు, సుబ్రమణ్యం, అరుణాచలం, నిర్మల, లలిత, సుశీల, రాజీమమూర్తి, రామచంద్ర, రమేష్ వెంకట కృష్ణ, చంద్రశేఖర్, మార్టిన్,వేలు , మురళి పాల్గొన్నారు.

అమర హాస్పిటల్లో ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్ చికిత్స

ప్రజాశక్తి- రేణిగుంట:

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ లోని అమర హాస్పిటల్‌లో ఇంట్రా వాస్కులర్ అల్ట్రా సౌండ్ అనే అధునాతన పరికరం సహాయంతో గడిచిన నెలలో ఏడు గురికి చికిత్స అందించి విజయవంతంగా డిశ్చార్జ్ చేశామని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శివకృష్ణ సీఏవో వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్ (ఐవియుఎస్) అనేది కొరోనరీ ఆర్టరీ లోపలి భాగాన్ని వీక్షించడానికి ఉపయోగించే కాథెటర్-ఆధారిత రోగనిర్ధారణ ప్రక్రియ, ఇది నిజ-సమయ వీక్షణను అందిస్తుందని ఈ అత్యాధునిక పరికరం చెన్నై, బెంగళూరు, హైదరాబాదు లాంటి సిటీలలో మాత్రమే పరిమితమై ఉండేదని, కానీ ఇప్పుడు తిరుపతిలోని అమర హాస్పిటల్ లో అందుబాటులో ఉండటం ఎంతో సంతో షకరమైన విషయం అన్నారు. ఈ పరిజ్ఞానం ద్వారా గుండె రక్తనాళాన్ని అల్ట్రాసౌండ్ ద్వారా పరీక్షి స్తుందని, రక్త నాళం పరిమాణం దానిలోని కొలెస్ట్రాల్ తీరు తెన్నులు తెలుసు కోవచ్చన్నారు. అంతేకాకుండా స్టంట్ చేసిన తర్వాత అది సరైన పద్ధతిలో జరిగిందా.. లేదా? తెలుసు కోవచ్చన్నారు. స్టంట్ జీవితకాలం (పెటెన్సీ రేట్) పెరుగుతుందని, సిఏబిజి అవసరమైన పేషెంట్స్‌కు కూడా కొంతమందికి సిఏబిజి అవసరం లేకుండా స్టంట్ తో సరి చేయవచ్చని తెలిపారు.

పల్లెలో నిద్రించి.. సమస్యలు ఆలకించి

ప్రజాశక్తి-వి.కోట: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే వెంకటేగౌడ, చిత్తూరు జెడ్పి చైర్మన్ శ్రీనివాసులు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. వికోట సచివాలయ పరిధిలోని కాజిపేటలో తొలతగా గ్రామస్తులతో సమావేశమయ్యారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోనే నిద్రించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, వైసిపి నాయకులు నాగరాజు, బాలగురునాథ్, గౌస్, అక్మల్, తమీంఖాన్, కిషోర్‌గౌడ్, కుమార్‌రాజా, హరి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లె నిద్రలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

ఆజాద్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మౌలానా అబ్దుల్ కలాం అజాద్ సేవలు చిరస్మరణీయం అని వైస్ ఎంపిపి శిరీషరెడ్డి అన్నారు. శనివారం జాతీయ విద్యా దినోత్సవం భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు మండలంలోని షాది మహల్‌లో జిల్లా వాక్స్ బోర్డ్ కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి మాట్లాడుతూ భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎంపిక చేసి విద్యలోనే నూతన ఒరవడిని ఏర్పాటు చేశారని ఆయన ఏర్పాటు చేసిన విధివిధానాలే ప్రస్తుతం విద్యలో కొనసాగుతున్నాయని ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సర్దార్, మైనార్టీ అధ్యక్షుడు హిద్దు, మండల సేవా దళ్ అధ్యక్షుడు షంషేర్, సచివాలయం కన్వీనర్ గౌస్, సీనియర్ మైనార్టీ నాయకులు షాకీర్, చాను బషీరుద్దీన్, ఖాదర్ భాష మైనార్టీ కార్యదర్శి గాఫరి, ముస్లిం జేఏసీ ఉపాధ్యక్షులు లాలు, జేఏసీ కార్యదర్శి జిలాన్ భాష, ఎర్ర పల్లి బ్రదర్స్, కుట్టి, హజరత్‌లు, అశోక్ పాల్గొన్నారు.

టపాకాయలు పట్టివేత

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్న టపాకాయలును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ కృష్ణమోహన్ తెలిపారు. శనివారం వివరాలను వెల్లడించారు. మండలంలోని నిడిగుంట గ్రామానికి చెందిన చిన్నరెడ్డెప్ప, కిరణ్‌కుమార్ లైసెన్సు లేకుండా టపాకాయలు విక్రయిస్తున్నారన్న సమాచారం దాడులు నిర్వహించామన్నారు. సుమారు రూ.2,59,629 విలువైన టపాకాలయలను ఇంటిలో ఉంచుకొని అమ్ముతున్నట్లు గుర్తించి సీజ్ చేశామన్నారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

సీజ్ చేసిన టపాకాయలు చూపుతున్న పోలీసులు

సినీ సన్నివేశాలు గుర్తుచేసుకుని.. నటుడు చంద్రమోహన్‌కు సంతాపం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: నటుడు చంద్ర మోహన్ మృతి బాధాకరమని తూగుండ్రం వాసులు పేర్కొన్నారు. 1978లో నిర్మించిన సీతామాలక్ష్మి సినిమా షూటింగ్ సన్నివేశాలను గుర్తు చేసుకున్నారు. అల్లు రామలింగయ్యతో కలసి నటించిన సన్నివేశాలు, తూగుండ్రం వద్ద వెంకటేశ్వర టాకీస్ వద్ద కూలీగా నటించిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. కాగా శనివారం చంద్రమోహన్ ఆకస్మిక మృతి పట్ల ఆ గ్రామస్తులు సంతాపం తెలిపారు.

తూగుండ్రం వద్ద సినిమా షూటింగ్‌లో నటిస్తున్న చంద్రమోహన్

క్రికెట్ కిట్లు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు 50 వేల రూపాయతో క్రికెట్ కిట్లును ఎమ్మెల్యే వరప్రసాద్ రావు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని కంట్రోల్‌లో ఉంచుకునే వారే ఆరోగ్యవంతులుగా ఉంటారని పేర్కొన్నారు. గ్రౌండ్‌లో నిత్యం వాకింగ్ చేసే వారందరూ చాలా ఆరోగ్యంతో ఉన్నారన్నారు. గూడూరు గ్రౌండ్ లోని క్రికెట్ క్రీడా కారులు సాయం కోరడంతో క్రీడాకారులకు తన వంతు సహాయం అందించడంలో చాలా ఆనందంగా ఉందన్నారు. గ్రౌండ్‌లో ఓ పక్క స్కేటింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని, గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న మహిళలకు వాష్ రూమ్స్ ఏర్పాటు చేస్తామని, గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్స్, క్రీడాకారులు కోరిన విధంగా ఇంకా ఎప్పటికీ గ్రౌండ్‌లో టపాసుల దుకాణాలకు అనుమతి లేకుండా వుండేలా ప్రభుత్వం నుండి జీవో తీసుకువస్తానని తెలిపారు. ఈయన వెంట పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, గూడూరు రూరల్ మండలం ఎంపీపీ గురవయ్య, సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, కొండూరు సునీల్ రెడ్డి, వైసీపీ నాయకులు మహేంద్ర యాదవ్, కొట్టు అశోక్ , పలువురు ప్రముఖులు, క్రీడాకారులు ఉన్నారు.

టపాకాయలు పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలి: సిఐ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: దీపావళి సందర్భంగా టపాకాయలు పేల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సిఐ విక్రమ్ పేర్కొన్నారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు టపాకాయలు పేల్చే సమయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని, ఏం మాత్రం నిర్లక్ష్యంగా ఉండకూడదని, వారి వారి ఇళ్ల వద్ద టపాసులు పేల్చే సమయంలో పక్కనే నీళ్లను కచ్చితంగా ఉంచుకోవాలని, ధరించే గుడ్డలు నిప్పును ఆకర్షించేవి లేకుండా చూసుకోవాలని సూచిం చారు. అన్నిటికంటే ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో గడ్డి వాములు, పూరి గుడిసెలు ఉన్నచోట కచ్చితంగా జాగ్రత్త లు పాటించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు టపా కాయల దుకా ణాల వద్ద ఎలాంటి ప్రమాదకర ఘటన లు చోటుచేసు కోకుండా పర్యవేక్షిస్తున్నామని ప్రజలు సుఖ సంతో షాలతో ఎలాంటి ఘటన లు చోటు చేసుకోకుండా పండుగను జరుపుకోవాలన్నదే పోలీసు శాఖ ఉద్దేశమని తెలిపారు.

బాలల ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట మండలం కరకంబాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవంను పురస్కరించుకొని ప్రజాశక్తి పిల్లల ప్రత్యేక సంచిక చిరుమువ్వలు పుస్తకాన్ని శనివారం ఉదయం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే పుష్పలత, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల రెడ్డి, ప్రజాశక్తి జిల్లా బ్యూరో ఇన్‌చార్జి గోపి, జిల్లా ఇన్‌చార్జి పి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దండు రామచంద్రయ్య, ఉపాధ్యాయులు మురళి, రవీంద్ర ,రాధాకృష్ణ , అబ్దుల్ రషీద్, ప్రజాశక్తి సిబ్బంది కే గురప్ప, ఏం సురేష్, జి మునిమోహన్, విలేకరి సుధీర్ పాల్గొన్నారు. అనంతరం యుటిఎఫ్ ఆధ్వర్యంలో మండలం లోని ఉన్నత పాఠశాలల గ్రంథాలయాలకు ఈ ప్రత్యేక సంచిక అందిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కే ముత్యాల రెడ్డి తెలిపారు.

ప్రజలకు ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రజలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఓ ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం, దుష్టశక్తులపై సాధించిన విజయాలకు ప్రతీకగా దీపావళి జరుపుకుంటామని వివరించారు. ఈ పండుగ ప్రజలందరి జీవితాల్లో ఆనంద కాంతులు నింపాలని ఆకాంక్షించారు. దీపావళి పర్వదినం సందర్భంగా ప్రజలం దరికీ సకల శుభాలు, సంపదలు, సౌభాగ్యాలు, విజయాలు కలగాలని, దివ్వెల వెలుగులలో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో విరాజిల్లాలని అభిలషించారు.

పాలస్తీనాకు మద్దతుగా సిపిఎం సంఘీభావ నిరసన

ప్రజాశక్తి -రేణిగుంట:

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని.. సామ్రాజ్యవాద అమెరికా పెత్తనం నశించాలని, ప్రపంచ శాంతి వర్ధిల్లాలని రేణిగుంట సిపిఎం నాయకులు డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద పాలస్తీనాకు మద్దతుగా సంఘీభావ నిరసన తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇజ్రాయిల్‌కు ఇస్తున్న మద్దతును వెంటనే విరమించుకోవాలని సిపిఎం నాయకులు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం, సిపిఎం నాయకులు వెంకటరమణ, ఆవాజ్ నాయకులు దిలీప్ బాష, సెల్వరాజ్, ఈశ్వరి, సరస్వతి, సుజాత, మహాలక్ష్మమ్మ, కుప్పస్వామి, పద్మమ్మ, వెంకటరమణ, శివానందం, సిఐటియు జిల్లా నాయకులు ముని రాజా, జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, సిపిఎం మండల కార్యదర్శి హరినాథ్ పాల్గొన్నారు.